## క్లుప్తంగా

### అభివృద్ధి పనులు ప్రారంభం



నకరికల్లు: శ్రీరామ సేవా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చల్లగుండ్ల గ్రామం చెరువుకట్టపై నిర్మించిన వాకింగ్ ట్రాక్ ప్రారంభోత్సవం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుకు రక్షణ కల్పిస్తూనే ప్రజల ఆరోగ్యం కోసం వాకింగ్ ట్రాక్, మొక్కలు నాటడంపై ఫౌండేషన్ అధ్యక్షుడు వేల్పుల కోటేశ్వరరావు, నిర్వాహకులను అభినందించారు. అనంతరం జెడ్పీ నిధులతో చేపట్టిన కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, సాగి శ్రీనివాసరావు, కాపా హరి, ప్రకాశరావు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో గర్నెపూడి మాజీ సర్పంచ్ మృతి



సత్తెనపల్లి: మండలంలోని గర్నెపూడి మాజీ సర్పంచ్ బోగాల బాపిరెడ్డి (75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. శనివారం ఆయన మృతదేహాన్ని జిల్లా గ్రంథాలయల సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర రెడ్డి సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎంపీటీసీ కాశిమాల ఓబయ్య, గ్రామ నాయకులు ఉన్నారు.

### మార్కెట్‌లో ట్రాఫిక్ కష్టాలు



సత్తెనపల్లి: పట్టణంలోని రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ వద్ద ట్రాఫిక్ కష్టాలు నిత్య కృత్యమయ్యాయి. కూరగాయలు కొనుగోలు చేసేందుకు పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎంతో మంది వినియోగదారులు నిత్యం వస్తుంటారు. మార్కెట్ ముందు వైపు ఇటీవల కొన్ని ఆక్రమణలను తొలగించారు. కానీ అదే ఆక్రమణల స్థానంలో టీడీపీకి చెందిన సానుభూతిపరులు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి, వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ కష్టాలు ఏర్పడి.. వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

### నేడు శరీర, నేత్ర దానంపై అవగాహన సదస్సు

నరసరావుపేట: స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం వర్కింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విజ్ఞాన కేంద్ర ప్రాంగణంలో శరీర, నేత్ర దానం అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కేంద్ర కార్య నిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా అమ్మనేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘ పల్నాడు, గుంటూరు జిల్లాల కోఆర్డినేటర్ ఎస్.చలపతిరావు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో సదస్సులో పాల్గొని శరీర, నేత్ర దానం దిశగా ఆలోచన చేయాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 94913 69330, 91774 79788, 92464 93157 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### క్రీడలతో విశేష గుర్తింపు

చిలకలూరిపేట: క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఏలూరు జిల్లా పెదవేగిలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ సాఫ్ట్ బాల్ పోటీలు జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు అండర్-19 బాలురు, బాలికల విభాగంలో కాంస్య పతకాలు సాధించింది. బాలుర జట్టులో ఏఎంజీ పదో తరగతి విద్యార్థులు చరణ్, డేసిక్, బాలికల విభాగంలో స్వాతి, లక్ష్మీప్రియ ఆయా జట్లకు ప్రాతినిధ్యం వహించడంతో వారిని అభినందించారు.

### ముద్ర రుణాల మంజూరు

శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హులైన వారికి రూ. 10 లక్షల వరకు ముద్ర రుణాలు మంజూరు చేస్తామని ఎస్‌బీఐ శావల్యాపురం బ్రాంచ్ శాఖ మేనేజర్ వలేటి ప్రసాద్ తెలిపారు. స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో శనివారం డిపాజిట్స్ చేసిన ఖాతాదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ. 2 కోట్ల ముద్ర రుణాల్ని మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలోని మతుకుమల్లిలో అగ్రి డెయిరీ పాడి గేదెల యూనిట్స్ 10 మందికి రూ. 80 లక్షలు, శానంపూడి, పోట్లూరు గ్రామాల్లో 10 మందికి రూ. 80 లక్షల రుణాలను అందజేశామని చెప్పారు. ముద్ర రుణాలు రూ. కోటి దాకా ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారి మద్రి యశ్వని, నగదు అధికారి శ్రీహరి, బ్యాంకు సిబ్బంది దాసరి ప్రకాష్‌బాబు, ఏస్తేరురాణి పాల్గొన్నారు.

## అన్నపూర్ణేశ్వరి పాహిమాం..



ప్రత్యేక అలంకరణలో నర్సింగపాడు అన్నపూర్ణాదేవి



గాయత్రీ మాతగా క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ



అచ్చంపేట: లక్ష్మీదేవి అవతారంలో వాసవీ మాత



సత్తెనపల్లి: అన్నపూర్ణాదేవిగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో



సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గాపీఠంలో గాయత్రీదేవి



సత్తెనపల్లి: వెంకటపతి కాలనీలో అన్నపూర్ణాదేవిగా దర్శనం



ముప్పాళ్ల: నార్నెపాడు భీమేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



అన్నపూర్ణాదేవిగా ఇనిమెట్ల కనకదుర్గాదేవి



బెల్లంకొండలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



పెదమక్కెన గ్రామంలో గాయత్రీ దేవిగా అమ్మవారి దర్శనం

దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించి, పూజలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు శనివారం అన్నపూర్ణదేవి, గాయత్రీ దేవిగా అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

– సాక్షి, నెట్‌వర్క్

# ఎదురుచూపులు తీరేదెన్నడో..!

- అచ్చంపేట రోడ్డులోని రైల్వే గేటు వద్ద తప్పని పాట్లు
- ఫ్లైఓవర్ నిర్మాణంలో తీవ్ర జాప్యం
- ప్రతిపాదనలు సిద్ధం, నిధులు ఓకే..
- నిర్మాణ విషయంలో అడుగు పడని వైనం



అచ్చంపేట రోడ్డులో ఫ్లైఓవర్ నిర్మించాల్సిన.. రైల్వే గేట్ కిందగా వెళ్తున్న వాహనదారులు

సత్తెనపల్లి: పల్నాడు ముఖ ద్వారమైన సత్తెనపల్లిలో రైల్వే స్టేషన్ ఉంది. ఈ రైల్వేట్రాక్ మీదుగా హైదరాబాదు-గుంటూరుకు పలు రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే స్టేషన్ సమీపంలోని అచ్చంపేట రోడ్డులో ప్రధాన రైల్వే గేటు సరాసరిన ప్రతి 10 నిమిషాలకోసారి రైలు రావడంతో వేస్తారు. ప్రయాణికులు, వాహన చోదకులు ఎక్కువసేపు ఆగాల్సి వస్తోంది. అనారోగ్యంతో వైద్యశాలలకు వెళ్లేవారు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనచోదకులను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత నిధులు మంజూరయ్యాయని ప్రకటనలు చేయడమే తప్ప ఇంతవరకు పనులు మొదలు కాలేదు.

### ప్రయోజనం పొందే గ్రామాలు

సత్తెనపల్లి మండలం పాకాలపాడు, రెంటపాళ్ల, దీపాలదిన్నెపాలెం, మరోవైపు గండ్లూరు, అబ్బూరు, ఫణిదం, బట్లూరు, గుజ్జర్లపూడి, ఇంకోవైపు బట్లూరు, కట్టమూరు, గోరంట్ల, ఇంకోక వైపు అబ్బూరు, దీపాలదిన్నెపాలెం, కట్టమూరు, గోరంట్ల, దీపాలదిన్నెపాలెం, లక్ష్మీపురం, గుడిపూడి, నందిగామ నుంచి రామకృష్ణాపురం మీదుగా రెవెన్యూ డివిజన్ కేంద్రమైన సత్తెనపల్లి రావడానికి అవకాశం ఉంది. అచ్చంపేట రోడ్డులోని రైల్వే గేట్ మీదగా సత్తెనపల్లి మండలంలోని గ్రామాలతో పాటు పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు, అచ్చంపేట మండలాల్లోని ఎక్కువ గ్రామాలు అటువైపు ఉండడంతో 24 గంటల పాటు ప్రయాణికుల రాకపోకలు కొనసాగుతుంటాయి. అత్యవసర సమయంలో అటువైపుగా వెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితులు నెలకుంటున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



గేట్ తీయడంతో వాహనాల రాకపోకలు

### గంటల తరబడి వేచి ఉండాల్సిందే

సత్తెనపల్లి రైల్వే స్టేషన్ మీదుగా 14 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. 14 రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో 28 సార్లు రైల్వే గేటు పడుతోంది. రోజుకు 2.40 గంటల పాటు ప్రయాణికు అక్కడ వేచి ఉండాల్సి వస్తోంది. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే ఈ అవస్థలు తప్పనున్నాయి. ఇక సాంకేతిక సమస్యలతో గేటు మరమ్మతులకు గురైనా, ట్రాక్ మరమ్మతులు చేయాలన్నా, రెండుమూడు రోజులు పాటు పెద్ద వాహనాల రాకపోకలు నిలిచి పోతున్నాయి. ఒక్కోసారి ఆర్టీసీ బస్సు సర్వీసులను కూడా రద్దు చేయడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అచ్చంపేట రోడ్డులోని రైల్వేగేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతులందరికీ పరిహారమివ్వాలి



చావపాడు రైతులతో మాట్లాడుతున్న రాధాకృష్ణ

అమరావతి: మండల పరిధిలోని యండ్రాయి, చావపాడు, పెదమద్దూరు, వైకుంఠపుర, అమరావతి, నరుకుళ్ళపాడు గ్రామాల్లో శనివారం కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ నష్టపోయిన భూములను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వరదల్లో పంట నష్టపోయిన రైతుల అందరి వివరాలు పరిహారానికి నమోదుచేయలేదన్నారు. సచివాలయంలో వ్యవసాయ సహాయకుడు కేవలం వాగు పక్కనున్న భూములను మాత్రమే ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నమోదు చేయడం, అది కూడా ఎక్కువ ఎకరాలు నష్టపోయినా రైతు పేరుపై రెండుమూడు ఎకరాలను మాత్రమే నమోదు చేస్తున్నారన్నారు. సొంత భూమికి మాత్రమే పరిహారం ఇచ్చి, కౌలు భూములను నమోదు చేయడం లేదని చెప్పారు. వైకుంఠపురంలో 1950లో సొసైటీగా ఏర్పాటు చేసి ఇచ్చిన భూమిని ఒక్కొక్కరికి 1.27ఎకరాల చొప్పున 68 మందికి డీకే పట్టాలు ఇచ్చారన్నారు. మొత్తం 86 ఎకరాల భూమిని రైతులు సాగుచేస్తున్నారన్నారు. ఈ భూములలో సాగు చేస్తున్న పంటతు దెబ్బ తిన్నా నమోదు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఎన్నికల్లో రైతులకిచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. అక్టోబరు 8 వియవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జరిగే కౌలు రైతు సదస్సుకు తరలి రావాలని కోరారు. సీఐటీయూ కార్యదర్శి బి.సూరిబాబు, సీపీఎం సభ్యుడు రాజు ఉన్నారు.

# రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఎం.శివకుమారి

నార్నెపాడు(ముప్పాళ్ళ): రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ ఎరువులు వాడటం వల్ల ఆరోగ్యంతో పాటుగా పర్యావరణానికి హాని తగ్గించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో వ్యవసాయశాఖ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతుల శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పత్తిలో గులాబీ రంగు ఉధృతిని లింగాకర్షక బుట్టలు వాడటం వల్ల తగ్గించుకోవచ్చన్నారు. మరో శాస్త్రవేత్త పి.ప్రవీణ్‌కుమార్ నేలలో సేంద్రియ కర్బన్ శాతాన్ని పెంచుకోవడం వల్ల గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించుకోవచ్చన్నారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త వెంకట్రాములు మాట్లాడుతూ వరిలో కొత్త వంగడాలు మినీకిట్‌ల గురించి వివరించారు. జేజీఎల్‌కి ప్రత్యామ్నాయంగా కొత్త వంగడాలు వచ్చాయని రైతులు సాగు చేయాలన్నారు. బీపీటీ 6082 రకం చిరు సంచులు రైతు జెట్టి నాగమల్లేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వీఏఏ కె.ప్రియాంక రైతులు పాల్గొన్నారు.

# 'ఈ-పంట'తో సంక్షేమానికి అర్హులు



దేచవరంలో వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ దేవదాసు

నకరికల్లు: సాగులో ఉన్న పంటలకు ఈ-క్రాప్, ఈ-కేవైసీ సకాలంలో నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయ సంక్షేమ ఫలాలు అందుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి, నకరికల్లు, నర్సింగపాడు, చల్లగుండ్ల, దేచవరం గ్రామాల్లో ఈ-క్రాప్, ఈ కేవైసీ నమోదు చేసుకున్న రైతుల పొలాలకు వెళ్లి శనివారం రైతులతో మాట్లాడారు. పంటల వివరాలను సూపర్‌చెక్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 85శాతం మంది రైతులు ఈ క్రాప్ నమోదు, ఈ కేవైసి నమోదు చేసుకొని ఈ పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 7వతేదీలోగా మిగిలిన రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

### ఈఓపీఆర్డీగా శ్రీనివాసరావు



క్రోసూరు: మండల పంచాయతీ విస్తరణాధికారిగా జి.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. చేబ్రోలు మండలం ఈవోపీఆర్డీగా చేస్తూ బదిలీపై వచ్చారు. కార్యదర్శి ఆదినారాయణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వెంకయ్య, కార్యాలయ సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ పంచాయతీల పాలన సక్రమంగా జరిగే విధంగా పనిచేస్తానన్నారు.

# రోడ్డు ధ్వంసం.. రాకపోకలకు తీవ్ర ఆటంకం



గణపవరం శివాలయం వీధిలో ధ్వంసమైన సిమెంటు రోడ్డు

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం శివాలయం వీధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుకు గండిపడింది. వాహనదారులు గత్యంతరం లేక ఆ రోడ్డు మీదుగానే ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. కుప్పగంజివాగు పరిధిలో సుమారు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉండటంతో రైతులు కూడా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ట్రాక్టర్లు, అరకలు, ఎడ్ల బండ్లు, ద్విచక్ర వాహనాలు వెళ్తుంటాయి. కొద్దిరోజుల క్రితం పంచాయతీకి చెందిన ట్రాక్టర్ క్వారీ గుంతలో చెత్తను పడవేసేందుకు వెళుతూ బోల్తాపడింది. ప్రొక్లెయిన్ సాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీసి రాకపోకలను నిలిపివేసేందుకు రోడ్డును కట్ చేస్తూ గొయ్యి తవ్వారు. దీంతో రైతులు, వాహనచోదకులు చుట్టూ తిరిగి ప్రయాణిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు పునరుద్ధరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన విద్యాసాగర్

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ఖాళీ గ్యాస్ సిలిండర్ల ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని గోళ్ళపాడు ఎస్టీ కాలనీ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సత్తెనపల్లి వైపు నుంచి వస్తున్న ఆటో నరసరావుపేట నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజుపాలెం మండలం గణపవరానికి చెందిన కె.విద్యాసాగర్ అనే వ్యక్తి ఎగిరి రోడ్డు మార్జిన్‌లో పడ్డాడు. కుడి కాలు విరిగిపోయింది. తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. విద్యాసాగర్ నరసరావుపేటలోని లలిత జ్యూవెలరీలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. విద్యాసాగర్ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై వి.సోమేశ్వరరావు ఘటనాస్థలానికి చేరుకుని, గాయపడిన విద్యాసాగర్‌ను చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

### హక్కుల పరిరక్షణ మండలి గౌరవ చైర్మన్‌గా ఏసురత్నం

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని క్రిస్టియన్ పేటకు చెందిన కోట ఏసురత్నం బాబు ఎస్సీ, ఎస్టీ, హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు మండలి రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా రాజారావు నుంచి శనివారం నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏసురత్నం బాబు 2026 డిసెంబర్ 31 వరకు ఈ పదవిలో కొనసాగునన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందేలా కృషి చేయగలడని విశ్వసిస్తూ నియమించినట్లు రాజారావు వెల్లడించారు.

# అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు



హిజ్రాలను హెచ్చరిస్తున్న వన్ టౌన్ సీఐ విజయ్‌చరణ్

నరసరావుపేటటౌన్: దసరా మామూళ్ల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని వన్ టౌన్ సీఐ విజయ్‌చరణ్ హెచ్చరించారు. శనివారం స్టేషన్‌లో హిజ్రాలతో సమావేశం నిర్వహించారు. దసరా మాముళ్ల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రకాష్‌నగర్ డీమార్ట్ వెనుక, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రాత్రుళ్లు హిజ్రాలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉందన్నారు. అటువంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిజ్రాలు అంతా ఆధార్ కార్డులు, ప్రస్తుత చిరునామాలు స్టేషన్‌లో తెలియపరచాలని చెప్పారు. ప్రజలను అసౌకర్య పరుస్తూ ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# సందడిగా దసరా ఉత్సవాలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

నరసరావుపేట రూరల్: ఏఎమ్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మామిడి తోరణాలు, రంగవల్లులు, బతుకమ్మలతో కళాశాలలో దసరా పండుగ శోభ ఉట్టిపడింది. బతుకమ్మ ఆటలతో విద్యార్థినులు, అధ్యాపకులు సందడి చేశారు. అనంతరం నిర్వహించిన దాండియా నృత్యంలో సంప్రదాయ దుస్తులతో అధ్యాపకులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన మహిషాసుర మర్దిని నృత్యరూపకం ఆకట్టుకుంది. కార్యక్రమాలకు కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఉత్సవాల వల్ల సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహనతో పాటు సామూహిక చైతన్యాన్ని పెంచుతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. కృష్ణారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ భూషణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### మహిళా మార్ట్‌ల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు



నరసరావుపేట రూరల్: మహిళా మార్ట్‌ల ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె.అమలకుమారి తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని మహిళా మార్ట్‌ను ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ మహిళా మార్ట్‌ల్లో సహజ ఉత్పత్తులతో పాటు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రజలు కూడా మార్ట్‌ల్లో లభించే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ప్రకృతి వ్యవసాయ స్టాల్‌లో ఉత్పత్తులు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో భాను, ఎస్‌ఎఫ్‌ఏ భాను, మేరి పాల్గొన్నారు.